కాలం తెచ్చిన మార్పు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర లోకోయమ్ కర్మబంధనః—అన్న వాక్యంమీదే నిలిచిపోయింది మనస్సు, గీతాపారాయణం చేసుకుంటున్న సూర్యనారాయణపంతులు గారికి. యజ్ఞార్థమైన కర్మ తప్ప తక్కినదంతా బంధనహేతువు; స్వార్థ రహితంగా చేసే కర్మ భగవదర్పితమూ, మోక్ష హేతువూ అవుతుంది...ఒక్కసారి గత జీవితమంతా కలగా కళ్ళయెదుట తిరిగి, ముప్ఫై ఏళ్ళనాడు బడిపంతులు ఉద్యోగం వదలి కాంగ్రెసులో అడుగు పెట్టినప్పటినుంచీ తనుచేసింది యజ్ఞార్థమైన కర్మేకదా అనిపించింది...పదిహేడేళ్ల క్రితం తరుణవయస్కుడైన కొడుకు స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి కావటం...తర్వాత కోడలుపోవటం...మనుమరాళ్ళు విమల, స్వరాజ్యం, తన సంరక్షణలో పెరిగి పెద్దవాళ్ళుకావటం, వైధవ్యంతో ఇల్లుచేరిన కొమార్తె రుక్మిణమ్మ వాళ్ళకు మాతృస్థానంలో నిలబడటం...ఇన్ని కష్టాల్లోనూ తను చలించక, నిర్లిప్తంగా దేశసేవలో నిమగ్నుడై, జీవితాన్ని అందుకే వినియోగించటం...ఒక్కసారి ఊహలో మెదిలి గీతావాక్యానుసారం బ్రతుకు నడిచిందన్న తృప్తి మనశ్శాంతినీ, భగవదనురక్తినీ హృదయగతం చేస్తోంది.

"నాన్నా, ఇదుగో కాఫీ."

పుస్తకంమూసి నెమ్మదిగా రుక్మిణమ్మ తెచ్చిన కాఫీ పుచ్చుకొని,

"పానకాలు కూరలు తీసుకొచ్చాడా, అమ్మాయ్?" అని ప్రశ్నించాడు.

"ఆఁ..." అని తలఊపి రుక్మిణమ్మ, కొంచెం సందేహిస్తూనే "అయితే నన్ను రాజమండ్రి ఎప్పుడు వెళ్ళమంటారు నాన్నా?" అన్నది.

"అసలు నువ్వు వెళ్ళటానికి వీల్లేదమ్మాయ్. ఇవాళ వాళ్ళకు ఉత్తరం వ్రాయించు. పాపాయికి సుస్తీచేసి అంత తొందరగా వుంటే, యిద్దరు పిల్లల్నీ తీసుకుని వెంటనే విమలను రైలెక్కి రమ్మని వ్రాయి. ఇక్కడికి వస్తే మన చేతనైన సాహాయ్యం చేద్దాం... అంతేగాని, యిలా ఎప్పుడంటే అప్పుడు వాళ్లు పిలవగానే నిలుచున్నపళంగా ఇల్లు వదలిపెట్టి పరుగెత్తడానికి యిక్కడ మరో మనిషిలేరని వాళ్ళకు ఆ మాత్రం తెలియాలి!"

ఆయన కంఠంలో తొంగిచూచిన కోపాన్ని గుర్తించిన రుక్మిణమ్మ బదులు చెప్పకుండా లోపలకు వెళ్ళిపోయింది.

పెద్దపిల్ల విమల చిన్నప్పటినుంచీ కూడా అంతే. ఏమాటకైనా సరే కొత్త ఎదురు చెప్పకుండా, చిలవలూ పలవలూ పెట్టకుండా పెరిగిన పిల్ల కాదు... ఇప్పటికి యింకా తండ్రితాతల ఆదర్శాలేమిటో గ్రహింపు లేకుండా ప్రవర్తిస్తూ వుంది...పెళ్లైన తర్వాత ఉన్న కొత్త వ్యక్తిత్వమూ నశించిందేమో! భర్తకు తెలీకపోతే తనకు తెలీదూ! ఆదర్శాల పరిధిలో పెరిగి చివరకు యిలా తయారైంది. పెళ్ళిలో కట్నం యివ్వలేదట, అందుకని భర్తకు డిస్ట్రిక్ట్‌మున్సిఫ్ ఉద్యోగం వేయించ కూడదా తాతగారు, తన పలుకుబడినీ, గతంలోచేసిన దేశసేవనూ ఉపయోగించి? అని ఏడాదినుంచీ వాదిస్తూ వుంది! అలాఅడగటానికే మాత్రం జంకు లేదు! అందరూ చేసుకుంటున్నారట యిలాంటివి, తాతగారుమాత్రం ఎందుకు చెయ్యరాదు? ఆనాడు కట్నం అవసరంలేదనీ, తాను ఆదర్శాలకు బద్ధుడైన విద్యావంతుణ్ణనీ, దేశసేవలో కీర్తి గడించిన వంశంలోని పిల్లను పెళ్లి చేసుకోవటమే తనకు గొప్ప అదృష్టమనీ వేషాలువేసిన అబ్బాయి యివాళ నిజస్వరూపం బయట పెట్టుకుంటున్నాడు! కట్నం బదులు ఉద్యోగం; లేకపోతే, కనీసం పొలంలో సగం యిస్తారా? లేదా? అని భార్యద్వారా బేరాలు పెట్టుతున్నాడు. ఏం ప్రయోజకులు యీ కుఱ్ఱవాళ్లు! వీళ్లట, దేశాన్ని భుజాలమీద మోసి, ఆకాశాని కెత్తుతారట!...పైగా బెట్టుచెయ్యట మొకటి...పెళ్లాన్ని రెండో కాన్పుకి యిక్కడికి పంపించకపోవటం; రుక్మిణమ్మమాత్రం అవసరంవచ్చి వ్రాసినప్పుడల్లా అక్కడికి వెళ్లాలి! ఏడిసినట్లుంది ఆత్మగౌరవం! లాయరుగా పైకివచ్చే యోగ్యతలేక 'ఉద్యోగం'

కావాలిట!...దేశంలోని యువకుల్ని చూర్చి ఆలోచిస్తూంటే అసహ్యం, విరక్తీ కలుగుతాయి!

"మ్యావ్, మ్యావ్," అనుకుంటూ ఏమీ ఎరగనట్లు వాకిట్లో తొంగిచూస్తోంది పెంపుడుపిల్లి, క్రితం రాత్రి పాలన్నీ త్రాగి పారిపోయి.

"ఛీ, ఛో, వెధవ దొంగబుద్ధి, నువ్వూ" అని విసనకఱ్ఱ విసిరారు; కాని తెలివిగా తప్పుకొని పారిపోయింది పిల్లి.

వీధిలో ఎవరో పిలిచారు.

గ్రామంనుంచీ వచ్చినరైతు ఎల్లయ్య.

"ఏం, ఎల్లయ్యా, ప్రొద్దుటే బయల్దేరావే, యిదేనా రావటం?"

"సిత్తం బాబయ్యా, మీతోనే కాస్త పని వుండి, మనవి సేసుకుంటామని."

"ఏమిటది?"

"ఏం లేదు...మా రెండోవోడు వున్నాడు సూశారూ! వాడు యిస్కూలు సదువు ముగిసి యిప్పుడు తాలూకాఫీసులో గుమాస్తాగా వున్నాడు.. పని యింకా ఖాయంలేదు....శానా కట్టంగా వుంది, వదిలేసి పైసదువు కెల్తానంటున్నాడు...మీరేం సెపుతారో, మీ సాయం కోరదామని ఒచ్చాను..."

"కష్టమంటే, నువ్వు కష్టం చెయ్యటంలేదా ఎల్లయ్యా! బి. ఏ. చదివితే మాత్రం యిప్పుడున్న ఉద్యోగంకన్నా మంచిది దొరకబోదు; అందువల్ల ఈ ఉద్యోగమే ఖాయమయ్యేట్లు ప్రయత్నం చెయ్యమను! దానికొక పరీక్ష వుంటుంది...సర్వీసుకమీషను పరీక్ష...ఆ పరీక్ష వ్రాయమను. ఉన్న ఉద్యోగం నిలుపుకోవటమే ఉత్తమం, ఎల్లయ్యా!"

వ్యవసాయం విషయాలూ అవీ మాట్లాడి ఎల్లయ్య వెళ్లిపోయారు. ఒక నిట్టూర్పు విడిచి, వార్తాపత్రిక చేతికి తీసుకున్నారు..."కాలేజీ విద్యార్థుల సమ్మె" అని పెద్ద అక్షరాల్లో వార్త! తేలిగ్గా డిగ్రీలు, ఉద్యోగాలు, జీతాలు, కావాలి వీళ్లందరికీ! సోమరితనం బలిసిపోతోంది దేశంలో...

"పోస్టు" అని గావుకేక...క్రొత్తగా వచ్చిన తపాలాబంట్రోతు!...పాతవాడెప్పుడూ "పంతులుగారూ, ఉత్తరమండీ!" అనేవాడు.

గుంటూరు......మెడికల్ కాలేజిలో వున్న స్వరాజ్యం దగ్గరనుంచీనా...కాదు, విశ్వనాథం వ్రాసినట్టున్నాడు...అమ్మాయి వారంరోజులుగా ఉత్తరం వ్రాయలేదు, కారణమేమిటో!...

"...మీకు విషయం సవిస్తరంగా వ్రాయనందుకు మన్నించి, ఏమీ ఆదుర్దా పడకుండా ఈ ఉత్తరం చూడగానే బయలుదేరి గుంటూరు రావలెను....అమ్మాయినిగురించిన ఒక ముఖ్యవిషయం మీతో ప్రస్తావించవలసి వుంది.. కొన్ని కారణాలవల్ల నే నక్కడికి రావటానికన్న, మీ రిక్కడికి రావటమే ఉత్తమమని నిర్ణయించి, మీకు శ్రమ కలిగిస్తున్నాను.. నేను స్టేషనుకు వస్తాను. సాయంత్రం ఒండికి తప్పక గుంటూరు చేరగలరని విశ్వసిస్తున్నాను..."

అమ్మాయిని గురించిన విషయం ఏమైవుంటుంది? ...దానికి యీమధ్య ఆరోగ్యం సరిగా వుండటంలేదు.. అది కారణమైతే యింటికే వచ్చివుండేదే? బాగా సుస్తీ చేసిందేమో...అయితే టెలిగ్రాం యివ్వలేదే! విశ్వనాథం ఏడాదిన్నరనుంచీ 'అమ్మాయికి వివాహం చెయ్యకూడదా!' అని సలహా యిస్తున్నాడు...తాతగారికి వృద్ధాప్యం వచ్చి వుండటంవల్ల మనవరాలికి తొందరగా పెళ్లి చేసి బాధ్యత తీర్చుకుంటే మంచిదని ఉద్దేశ్యం కాబోలు.. లేకపోతే ఇంజనీరింగు ప్యాసైన మేనల్లుడికి చేసుకుందామన్న కోరిక అయివుంటుంది... తనకీ కారణాలు రెండూ నచ్చవు...స్వరాజ్యం మనస్తత్వం తనకు బాగా తెలుసు... చదువు పూర్తి చేసుకుంటుంది; డాక్టరై, వ్యక్తిత్వాన్ని సంపాయించి, తండ్రి తాతలవలె జీవితాన్ని ఆదర్శప్రాయంగా దిద్దుకుంటుంది; ఇప్పుడప్పుడే పెళ్లి, సంసారం లాంటి ఊబిలో దిగదు...

....ఆటల్లోంచి పరుగెత్తివచ్చి, చెవిదగ్గర నోరుపెట్టి, ఏదో రహస్యమైనట్టుగా "తాతయ్యా, నా బొమ్మకు పెళ్లి చేశా" అని మెల్లగా చెప్పి, తనముఖంలోకి చూసే అయిదేళ్ల చిట్టి..."మంచిది, వెళ్లి అత్తారింటికి పంపించు తల్లీ" అనేసి తనపనిలో తను నిమగ్నుడైనా, చెవిదగ్గర ఆ స్పర్శ, ఆ వాక్కు, ప్రతిస్పందిస్తూనే వుండి, మధురానుభూతి కలిగించేవి... పదేళ్లపిల్లగా గాంధిజయంతిరోజు తనదగ్గర కూర్చుని మహాత్ముని 'ఆత్మకథ' చదువుతూ .... ఒకసారి జ్వరం వచ్చినప్పుడు, "తాతయ్యా, నాకీపాడు జ్వరం ఎందుకు వచ్చింది? మామూలంగా నీకెంత విచారం! ...ఇక పోతుందిలే తాతయ్యా!" అని తన్ను ఊరడిస్తూ...అహింసమీద చక్కని వ్యాసం వ్రాస్తే స్కూల్లో యిచ్చిన బహుమతీ తెచ్చి "తాతయ్యా, ఇది నీకు బహుమతి!" అని పలుకుతూ .... ఇంటర్మీడియేట్‌లో తెలుగులో తప్పటంతో, తాతయ్య కోరిక ప్రకారం మెడిసిన్‌లో ప్రవేశించటానికి ఒక్క ఏడాది ఆలస్యమై పోయిందన్న దిగులుతో అన్నం మానివేసిన చిట్టి...చిట్టితల్లి ది నవనీత హృదయం!.. ఆసుపత్రిలో రోగులు కాని, వీధిలో చిక్కి శల్యావశిష్టులైన బిచ్చగాళ్లు కాని కంటపడితే చూచి సహించలేక బాధపడే మెత్తని మనస్సు ... చిట్టి మానవసేవలో ఆదర్శమూర్తి అవుతుంది!.. చిట్టి డాక్టరై-తను ముసలి

తనతో మంచంమీద ... చిట్టి సైథస్కోపుతో తన హృదయాన్ని స్పృశిస్తూ, మందు త్రాగిస్తూ—తను చిట్టి ముఖంవైపు చూస్తూ...చిట్టి కీర్తినీ, మంచినీ, అందరూ శ్లాఘిస్తూ—తను తృప్తిగా సజల నేత్రాలతో అశీర్వదిస్తూ...భగవత్సన్నిధిని చేరుకుంటాడు.

కళ్లు తుడుచుకుంటూ లేచి, వంటింటి వైపు వెళ్లారు.

"అమ్మాయ్, పెందలాడే వడ్డించు, కొంత విశ్రమించి, గుంటూరు బయల్దేరాలి."

"గుంటూరా? ఇప్పుడా?"

"ఆఁ.. మూడింటి రైలుకి వెళ్లాలి...ఏం లేదు, విశ్వనాథం నన్నొకసారి వచ్చి వెళ్లమని ఉత్తరం వ్రాశాడు.. బహుశా ఏదో వాడి స్వవిషయమే అయి వుంటుంది.. వివరాలు వ్రాయలేదు.. అమ్మాయిని కూడా ఒకసారిచూచి రావాలని వుంది."

* * *

రైల్లో ప్రక్కన కూర్చున్న నలభైఏళ్ళ సిల్కు లాల్చీ వ్యక్తి కొన్నేపటికి పలకరించాడు:

"ఏమండీ, అసెంబ్లీ సెషన్సుకి హైదరాబాదు వెళుతున్నారా?"

ఖద్దరు టోపీ, ఖద్దరు దుస్తులు, కిఱ్ఱుచెప్పులు చూచి తనను కాంగ్రెసు శాసన సభ్యుడని అపోహ పడినట్లు గ్రహించి విసుక్కున్నారు సూర్యనారాయణ గారు.

"కాదు... నేను రాజకీయాలనుంచి విరమించుకొని పదేళ్లుకావస్తోంది; కానీ పాతికేళ్లుగా అలవాటు పడ్డ యీ దుస్తుల్ని అలాగే వేసుకుంటున్నాను... తప్పంటారా?"

"అబ్బే కాదండి!...మీ రింకా రాజకీయాల్లో ప్రవేశం కలిగి వున్నారనే అభిప్రాయపడ్డాను, అంతే!"

"ఒకప్పుడు దేశసేవకు చిహ్నం, యిప్పుడు రాజకీయాలకు చిహ్నం...అదీ మార్పు."

"ఒకప్పుడు మంచికీ, యిప్పుడు అధికారానికీ!" అని చిన్నగా నవ్వాడు ఆవ్యక్తి.

"ఏ చిహ్నమైనా, ఆదర్శమైనా, ప్రజల్లోనే వుంది కదండీ, దానికి వాళ్ళిచ్చే విలువ, అర్థం! పూర్వం త్యాగాన్ని మెచ్చుకున్నారు; యిప్పుడు అధికారాన్ని గౌరవిస్తున్నారు, కానివ్వండి."

అలా అన్నప్పటికీ, ఆ మాట తనకే ఎందుకో తృప్తిగా లేదు. ఏ కారణంవల్లనైనా ఒక చిహ్నానికి అర్థం, విలువ మారినప్పుడు దాన్నింకా వుంచుకోవటమా, విసర్జించటమా? అనే సమస్య తేలటంలేదు.

స్వాతంత్ర్యం రాకపూర్వము సామాన్యుల్లో కూడా కనిపించిన కార్యదీక్ష, నిజాయితీ యిప్పుడెక్కడా తనకు కనిపించటంలేదు. ప్రతిమనిషీ డబ్బు కోసమో, పదవి కోసమో ప్రాకులాడుతూ కనిపిస్తాడు ప్రస్తుతం; స్వార్థం, దానితోబాటు కపటం, మోసం, దేశంలో స్వేచ్ఛా విహారం చేస్తున్నాయి. మధ్యవయస్కుల్లోనే కాదు యీ విపరీతం; ఆదర్శాలు మోసులెత్తవలసిన యువకుల్లో కూడా ఒక చెంప స్వార్థమో, అప్రయోజకత్వపు వెకిలి తనమో స్ఫురిస్తూ వుంటుంది.

ఎదుటి కిటికీవద్ద, రేయాన్‌స్లాక్ షర్టు గాలికి రెపరెపలాడుతూ ఒక చేత డిటెక్టివ్ నవల, ఇంకొక చేత సిగరెట్టు...ఆ రెండింటిలో లీనమైన యువకుడి వైపొకసారి చూచి దృష్టిమరల్చుకున్నారు.

తన కాలం అయిపోయింది. మంచి సమయంలో పదేళ్ల నాడు పార్టీలో వర్గాలు ఏర్పడి క్రొత్త పార్టీలు ఉత్పన్నమాతున్న క్షణాల్లో విరక్తిచెంది విరమించుకున్నారు రాజకీయాలనుంచీ......ఎన్నికలు ఒక వ్యాపారం......దైవచింతన, పారమార్థికాలోచన, ఓపిక వుంటే గ్రామోద్ధరణ యివే తన లక్ష్యాలు అనుకొన్నారు! ఆ మాటే మిత్రులతో అంటే... "మీలాగ మంచి భూవసతి, ఆదాయం వుంటే మేమూ అలాగే అనుకోవచ్చు" అన్నారు...వాళ్ళకూ తనకూ మధ్య ఒక అగాధంవుందని ఆ రోజు గుర్తించారు... తర్వాత ఆ అగాధం పెరుగుతూనే వచ్చింది.

గాంధీగారి ఖద్దరుదుస్తులు ఒక చిహ్నం...దానికి తానొక అర్థం, లోకం ఇంకోఅర్థం ఆపాదించే క్రొత్తపరిస్థితి ఏర్పడినప్పుడు, తానింకా ఈ బాహ్య చిహ్నానికి అంటిపెట్టుకోవటం సమంజసమా? వ్యక్తిగతమైన నిల్చిన తన విశ్వాసాల్ని ఈ దుస్తులు వ్యక్తపరచలేనప్పుడు, వీటిని విసర్జించటమే కర్తవ్యమేమో!

గుంటూరులో రైలు దిగగానే విశ్వనాథం కలుసుకున్నాడు.

"ఏమిటి విశేషం విశ్వనాథం?"

"ఏంలేదు బాబాయ్, ఇంటికి పదండి, సావధానంగా చెబుతాను."

"చిట్టి ఖులాసాయేనా?"

"ఆఁ."

భోజనాలైన తర్వాత విశ్వనాథం విషయం ప్రస్తావించాడు.

"మావాడి స్నేహితుడు సత్యం అని యిక్కడ కాలేజిలో ఇదివరకు లెక్చరరుగా ఉండేవాడు. ఈ యేడాది తిరుపతి యూనివర్సిటీలో ఉద్యోగమై వెళ్ళాడు. అమ్మాయి స్వరాజ్యం ఇంటరులో అతని దగ్గరే చదువుకుంది...ఒకసారి మీరువచ్చినప్పుడు

ఇక్కడే ఆ అబ్బాయిని పరిచయంచేసినట్లు కూడా జ్ఞాపకం...మీకు గుర్తువుందో లేదో!"

"లేదు."

"ఆ అబ్బాయికి మన అమ్మాయి నివ్వటాన్ని గురించి మీ అభిప్రాయం ఏమిటంటారు?"

"మంచిదే విశ్వనాథం!...కాని సంబంధాలు దొరక్క కాదు నేను అమ్మాయి వివాహ విషయం శ్రద్ధతీసుకోక పోవటం...దాని చదువు పూర్తికావాలని నా ఉద్దేశ్యం...జీవితంలో తన లక్ష్యమేమిటో, ఆదర్శమేమిటో తనే నిశ్చయించుకుని, నిర్వర్తించే అవకాశం ఉండాలి. చిట్టి దృక్పథంవేరు, అది అందరిలా కాదు...అందుకే వివాహాన్ని గూర్చి ప్రస్తుతం ఆలోచించటం లేదు...దానికి యిష్టం ఉండదు... సరేనా?"

"అలాకాదు బాబాయ్, అమ్మాయికి ఒక వేళ సత్యంఅంటే ఇష్టమే వుంటే వివాహానికి అభ్యంతరం ఏమిటి?"

"ఏం? అలా అడిగి తెలుసుకున్నావేమిటి? అడిగితే ఏమంటుంది; పెద్దలయిష్టం, అభ్యంతరం లేదనే అంటుంది...అంతమాత్రాన అమ్మాయి ఇష్టాన్ని పాడుచెయ్యటం నాకిష్టంలేదు."

విశ్వనాథం ఒక్కక్షణం ఆగి, మళ్ళీ ప్రారంభించాడు.

"బాబాయిగారూ, జీవితానికి లక్ష్యం యేమిటంటారు? తృప్తి, శాంతి, ఆనందం అనుకుంటాను నేను. ఏమార్గాన వెళ్ళినా యివే గమ్యం కదా వ్యక్తికి... చివరకు అవే భగవత్స్వరూపంకూడా అని అంటారు."

"కానీ తృప్తి, శాంతి, ఆనందం అనేవి నిస్స్వార్థమైన కర్మవల్ల లభ్యంఅయినప్పుడే వాటికి ఆ ఉదాత్తత, అనశ్వరగుణమున్నూ! అది అంతసులభం కాదు విశ్వనాథం...త్యాగం, సేవ—గీతలో 'యజ్ఞం' అంటాడు—ఆ దృక్పథం లేకపోతే ఆనందం, తృప్తి లభించవు; తాత్కాలికోద్రేకం తప్ప!"

"మీ రన్నది అక్షరాలా సత్యం; కాని మీరు వ్యక్తియొక్క "మనోధర్మా"న్ని గురించి ఆలోచించటం లేదేమో అనిపిస్తుంది...సులభంకాక కష్టమైనదాన్నీ, తనకు అలవికాని పనినీ చెయ్యమంటే బలహీనుడు కాలో, చెయ్యో విరగ్గొట్టుకుంటాడు. అంతేకాదు శక్తులుకూడా భిన్నంగా వుంటాయి వ్యక్తుల్లో—ఒక శిల్పికీ, ఒక వడ్రంగికీ ఎంతభేదం!... దేహధర్మం ఎలా ఒక అవధి నిర్ణయిస్తుందో, వ్యక్తిచేసే కర్మకు 'మనోధర్మం' కూడా ఒక అవధి నిర్ణయిస్తుందంటాను. త్యాగం చెయ్యలేనివాణ్ణి త్యాగం చెయ్యమని, ఒక వేళ భ్రమపెట్టి, బలవంతపెట్టి చేయించినా దానికి విపరీత ఫలితం తర్వాత వుండనే వుంటుంది... ఎవరో ఒకళ్ళిద్దరు మీలాంటివాళ్లు తప్ప, దేశస్వాతంత్ర్యంకోసం త్యాగం చేశామనుకొన్నవాళ్ల తర్వాతి ప్రవర్తన మనం యిప్పుడు చూస్తూనే వున్నాం. మీరు ఏ నైతికపతనాన్ని గురించి మథనపడుతూ వుంటారో, ఆ మార్పంతా త్యాగానికి ఒక 'ప్రతిక్రియ' (రి-యాక్షన్)గా తోస్తోంది నాకు... అందువల్ల ఆదర్శాల మేరకు వ్యక్తిత్వాన్ని సాగదీసి నాశనం చెయ్యటంకన్నా, వ్యక్తిత్వం మేరకు ఆదర్శాలను కుదింపు చెయ్యటమే మంచిదేమోనని నా ఊహ! ...మెడిసిన్ చదువుకుని లోకంలో వ్యవహరించే ఆడపిల్లలు తప్పకుండా వున్నారు; కాని అలా చెయ్యలేనివాళ్లను బలవంతం చెయ్యకుండా వాళ్ల 'మనోధర్మా'న్ననుసరించి జీవితాలు చక్కదిద్దటం న్యాయం అనుకుంటాను, బాబాయ్."

"నువ్వు చెప్పింది బాగానేవుంది, కానీ చిట్టి విషయం వేరు...దయ, కారుణ్యం చిట్టికి సహజ గుణాలు; బాధానివారణ, మానవసేవ బలవంతంగా తెచ్చిపెట్టుకుని చెయ్యవలసిన అవసరంలేదు చిట్టికి."

"బాబాయ్, నిన్న సత్యం యిక్కడికి వచ్చాడు. అమ్మాయి అతనికి బాగా తెలుసు...మూడేళ్లనుంచీ అమ్మాయిమీద అతనికి అనురాగం; అంతేకాదు అమ్మాయిని చక్కగా అర్థంచేసుకున్నాడని కూడా తోచింది నిన్నటి రోజు అతనితో మాట్లాడిన తర్వాత...అమ్మాయికి అతనిపై అనురక్తి వుంది... కాని ఇదొక్కటే కారణంకాదు...రెండేళ్లనుంచీ నేను అమ్మాయిలో గమనిస్తూనే వున్నాను...ఎంత సున్నితమైన మనస్తత్వం అంటే, బొత్తిగా బాధ, వ్యాధి, వీటని చూచి సహించలేదు; ఏదైతే జుగుప్సాకరంగా వుంటుందో దాన్ని తొలగించటానికీ, బాధను నివారించటానికీ మొట్టమొదట సహనదార్ఢ్యం వుండాలి; అది అమ్మాయిలో లేదు. ఇంకొక అవసరమైన గుణం, నలుగురిలో తిరిగే వ్యవహార దక్షత, ప్రగల్భత, బొత్తిగా లేవు. మీ రూహించిన దీక్షాభారం వహించటానికి ఆమె అంగీకరించటం మీమీద వున్న ప్రేమ, గౌరవంవల్లే...చివరకు యిప్పుడేం జరిగిందనుకొన్నారు! సత్యాన్ని వివాహమాడటానికి అంగీకరించి కూడా ఆ సంగతి మీతో చెప్పే ధైర్యంలేదు... ఏడాదినుంచీ మీకు తెలియజేయటానికి ప్రయత్నిస్తూనే వుంది...చివరకు లాభంలేదని సత్యం రిజిష్ట్రరు వివాహానికి ఒప్పించాడు; అది మొన్నటిరోజు జరుగవలసింది...కాని తనలో సంఘర్షణని ఎటూ తేల్చుకోలేక అమ్మాయి మొన్న హాస్టలు వదలి వెళ్లిపోయింది."

"ఆఁ..."

"రాజమండ్రిలో వాళ్లక్కయ్య దగ్గరవుందని, నిన్న యిక్కడినుంచీ వెళ్ళి కనుక్కుని టెలిగ్రాం పంపించాడు సత్యం యివాళ...కానీ, ఆలోచించండి.

అమ్మాయి తనకు మించిన భారం మోస్తోంది... అది ఆమె సహజ ప్రకృతికి విరుద్ధం... నిన్న సత్యంతో చాలసేపు మాట్లాడాను. చాల యోగ్యుడు; అమ్మాయి వ్రాసిన రెండు ఉత్తరాలు తన దగ్గరున్నవి నా చేతి కిచ్చాడు, వివాహానికి మీ అనుమతి కోరటానికీ, మీకు నచ్చజెప్పటానికీ... మీకు విషయమంతా నేను వివరిస్తానని హామీ యిచ్చాను... వివాహం చేయటమే నాకు కర్తవ్యంగా తోస్తోంది..."

"ఏవి ఆ ఉత్తరాలు ?"

విశ్వనాథం ఉత్తరాలు తెచ్చియిచ్చాడు.

"...తాతయ్య ముందు నిలబడి, ఆయనతో యీ విషయం ప్రస్తావించే శక్తి నాకు లేదు; కాని ఆయనకు తెలీకుండా వివాహం చేసుకుని తర్వాత ఆయన దగ్గరకు ఏ మొహం పెట్టుకుని వెళ్ళను ?... అందువల్ల మీరు నాతో వచ్చేటట్లయితే యిద్దరూ వెళ్ళి ఆయన అనుమతి, ఆశీర్వాదం పొందిన తర్వాతే అలా చెయ్యటం బాగుంటుందేమో ! మీరు నాతో వుంటే వెళ్ళగల ధైర్యం వుంటుంది నాకు..."

రెండో ఉత్తరం మరుసటి రోజునే వ్రాయబడింది.

"...నిన్నటిరోజంతా యీ విషయం ఆలోచిస్తూనే వున్నాను... నేను వ్రాసినట్లు ముందుగా వెళ్ళటం అసలు సాధ్యం కాదనుకుంటాను... ఏమంటే తాతయ్య బాధపడితే, ఒకవేళ నిరాకరిస్తే, అప్పుడు నేనేమీ చెయ్యలేకపోతాను. అది మీకు అన్యాయం కాదా !... వివాహం జరిగిపోయిందని తెలిస్తే తాతయ్య తప్పక క్షమిస్తాడని నాలో ఏదో చెబుతూంది... అందువల్ల మొదటి ఏర్పాటు ప్రకారమే చేద్దాం..."

ఉత్తరాలు చదివి ముగించి, రుద్ధకంఠంతో "విశ్వనాథం, ఆలోచిద్దాం. నాకు అలసటగావుంది... ఇక విశ్రమిస్తాను" అన్నారు సూర్యనారాయణగారు.

* * * *

పడుకున్నారు కాని నిద్రపట్టలేదు. తాను నిలుచున్న భూమి పాదాలక్రిందనుంచీ ఉన్నట్లుండి జారిపోయినట్లు... మనస్సు అయోమయంగా వుంది... ఏం జరిగింది ?

ఆదర్శాల మేరకు వ్యక్తిత్వాన్ని సాగదీయటం కన్న, వ్యక్తిత్వం మేరకు ఆదర్శాలను కుదింపు చేయాలంటాడు విశ్వనాథం.

కానీ, నీలాకాశంలో ఎగిరే పక్షిని రెక్కలు త్రుంచి నేలమీద పారవేసినట్లుగా అనుభూతి... ఇక మిగిలిందేమిటి ?... ఎందుకీ శిక్ష ?... ఎందుకీ దుఃఖం ?

దేన్ని గురించీ ఆలోచించవలసిన ప్రమేయం ఇక లేదు... "దుఃఖేష్వనుద్విగ్నమనాః"... నిర్లిప్తతకన్న కర్తవ్యం లేదే!... మనో నేత్రంముందు శ్రీకృష్ణునిమూర్తిని నిలుపుకొని కన్నులు మూశారు...

.........భారతయుద్ధం ముగిసి విజయం చేకూరిన తర్వాత కురుక్షేత్రంలో యుద్ధస్మృతులను గూర్చి ముచ్చటించుకొంటున్న కృష్ణార్జునులు... బంధుమృతి కోసం దుఃఖిస్తున్న అర్జునుడు, వైరాగ్యభావంతో "నన్ను నీలో చేర్చుకొమ్మ"ని కృష్ణపరమాత్మను అర్థిస్తున్నాడు... శ్రీకృష్ణుడు అర్జుని గాండీవంవైపు వ్రేలుచూపి, చిరునవ్వుతో "దాన్ని విసర్జించు బావా! అప్పుడే నీ కోరిక సాధ్యం" అంటున్నాడు... గాండీవంవైపు చూచుకొని, గతాన్ని జ్ఞాపకం తెచ్చుకొంటూ అర్జునుడు "దీన్ని ధరించమనీ, యుద్ధం చెయ్యమనీ నువ్వే బోధించావే! ధర్మసాధన చేసిన ఈ గాండీవం నాలో భాగం కాదా?" అని సందేహిస్తున్నాడు..."దానితో ఒకప్పుడు ధర్మసాధన చేసినా ఇప్పుడది ప్రతిబంధకమే" అంటున్నాడు కృష్ణుడు...అర్జునుడు మళ్ళీ గాండీవం వైపు, తనవైపు చూచుకొంటున్నాడు...సూర్యనారాయణ తనవైపు, తన దుస్తులవైపు చూచుకొంటున్నారు. ఎదురుగా గాంధీగారు నవ్వుతూ ఏదో మాట్లాడబోయారు. అయిదేళ్ళ చిట్టి "తాతయ్యా బొమ్మలపెళ్ళికి రావా?" అని పిలుస్తోంది... చిట్టిని ఎత్తుకున్నాడు "తాతయ్యా, గాంధీని చంపేశారు" అంటోంది..."అవునమ్మా, అవును"...కన్నీళ్ళు ఆపుకోలేకపోతున్నారు.

స్వప్నంనుంచి మెలకువ వచ్చింది... తెల్లవారుతోంది...

"నేనీ ప్రొద్దుటి బండికే వెళ్తాను. ఇంకా ఒక గంట ఆలస్యం వున్నట్టుంది."

"ఈ పూట వుండి వెళ్ళండి...బహుశా సత్యం ఇవాళ వస్తాడు. నిన్న మీకు ఉత్తరం వ్రాసేటప్పటికి అమ్మాయి రాజమండ్రిలో వుందని తెలీదు. లేకపోతే నేనే సత్యాన్ని తీసుకుని మీ దగ్గరకు వచ్చేవాణ్ణి" అన్నాడు విశ్వనాథం.

ఆయన తన మనస్సేమిటో తెలియబరచలేదు. ఆయన మౌనం చూస్తే విశ్వనాథానికి అనుమానం కలుగుతోంది.

"అమ్మాయి విషయం చివరకేం నిశ్చయించారు?" అని ప్రశ్నించాడు.

"ఇందులో నేను నిశ్చయించేదేమీ కనిపించటం లేదు!"

"అలాకాదు, అమ్మాయి మీ మీదే పూర్తిగా ఆధారపడివుంది."

"అలా ఆధారపడలేదనీ, ఆధారపడకూడదనీ నువ్వేగా రుజువుచేశావు రాత్రి!"

విశ్వనాథం నొచ్చుకున్నాడు.

"బాబాయ్, నేనేమీ రుజువు చెయ్యలేదు... అమ్మాయి మీ అనుమతి లేనిది ఒక్క అడుగుకూడా

ముందుకు వెయ్యలేదనేగా తెలుస్తోంది జరిగినదాన్ని బట్టి!"

"విశ్వనాథం, నేను నిశ్చయాలు చేసే కాలం, పరిస్థితి దాటిపోయాయని గుర్తించాను. "నిర్మమో నిరహంకారః స శాంతిమ్ అధిగచ్ఛతి" అన్న ఉపదేశమే నాకు శరణ్యం..."

"కాని మీరాశీర్వదించ వలసినప్పుడు ఆశీర్వదించకపోవటం కూడా ఒక నిశ్చయమే! అందులో మాత్రం మమకారం వుండదంటారా?"

"ఎలానైనా వాదిస్తూ పోవచ్చు; నాకు వేళైంది విశ్వనాథం."

"నేనూ వస్తాను పదండి."

"వద్దు...నన్ను వెళ్ళనియ్యి."

"అయితే నేను రేపు సత్యాన్ని తీసుకొస్తాను."

రైల్లో కూర్చున్న తర్వాత వచ్చిన స్వప్నం గుర్తువచ్చింది. సూర్యనారాయణగారికి నిన్నటి రోజు రైల్లో తను ఆలోచించిన సమస్యకు అదీ జవాబు: చిహ్నాలను విసర్జించితేకాని విముక్తి, భగవంతునితో ఐక్యం సాధ్యం కావు... చిహ్నాలనేవి బాహ్యచిహ్నాలే కావు, మనోదృక్పథాలు, ఆదర్శాలు కూడా చిహ్నాలే. జీవితరంగంలో కర్మచేస్తున్నంతసేపు త్యాగదృష్టి, మానవసేవ ధర్మసాధనకు పరికరాలు, గాండీవంలాగ...ధర్మసాధన అయిపోయిన తర్వాత వాటి నంటిపెట్టుకోవటం, వాటిమీద మమకారం బంధనహేతువు...విశ్వనాథం అన్నట్లు తనలోనూ ఒక 'ప్రతిక్రియ' లేకపోతే, మనుష్యుల్లో తనకు నిత్యమూ కనుపించేవి స్వార్థం, సంకుచితత్వం తప్ప మరొకటి లేదు! ఎందుకని? తనకూ మనుష్యులకూ మధ్య, చివరకు తనకూ చిట్టికీ మధ్య యీ అప్రశుతి, తనలో ఈ అంశాంతి, అసహనం, రావటానికి కారణాలు తనమనస్సులో నిలిచిపోయిన 'చిహ్నాలు'. వాటి కొలతబద్దలకు అందని మానవత్వం తనకు పనికిమాలినదైపోయింది; కాని అందిన మానవత్వం ఎక్కడా కనిపించలేదు, తన ఊహాలోతప్ప! తనలోమాత్రం క్షమ, సహనం లోపించలేదా? జ్ఞానోదయానికే యీ పరీక్ష పెట్టాడు భగవంతుడు...అన్నికర్మలూ జ్ఞానంలో పర్యవసిస్తాయనీ, చివరకు జ్ఞానంకూడా 'యజ్ఞ' వస్తువుగా అర్పితం కావాలనీ గీత చెబుతున్న మాటకు యిప్పుడే అర్థం తెలిసివస్తోంది. జీవితానుభవంలో గడించిన జ్ఞానం సర్వం యిలా సమర్పణ అయినతర్వాత మిగిలేదేమిటి? శూన్యమా? కాదు, శూన్యమన్న భయం రాత్రి మనస్సును కలత పెట్టింది, కానీ కృష్ణభగవానుడు "శూన్యం కాదు, నేనే ఉన్నా"నన్నాడు...ఎక్కడ? జ్ఞానానికి అవతలి ఒడ్డున..."సర్వధర్మాన్ పరిత్యజ్య మామ్ ఏకమ్ శరణం వ్రజ" అని పిలుస్తున్న శ్రీకృష్ణుని కన్న శరణ్యం ఏమివుంటుంది?

ఇల్లు చేరుకోగానే రుక్మిణమ్మ ప్రశ్నించింది: గుంటూరు వెళ్ళిన కార్యం ఏమిటని. "చిట్టికేదో పెళ్ళి సంబంధం వచ్చిం...నీ అభిప్రాయమేమిటి?" అన్నాడు నీరసంగా.

* * *

"చిట్టికి తగిన సంబంధమంటే అపురూపమే... అలా అన్నివిధాలా సరితూగితే, అమ్మాయి యిష్టపడితే...అంతకన్న అదృష్టమా?" అన్నది రుక్మిణమ్మ. ఆమె ఉత్సాహం చూచి, నిట్టూర్చి, తనగదిలోకి వెళ్ళిపోయాడు.

ఆరోజు సాయంత్రంబండికి స్వరాజ్యం, విమలా, విమల పిల్లలూ వచ్చారు. రుక్మిణమ్మ సంతోషంతో ఏవో చెప్పుతోంది వాళ్ళకు...

పడకకుర్చీలో కూర్చుని కిటికీ అవల ముసుగుకొంటున్న చీకట్లలోకి చూస్తున్నాడు...ఇంకా చంద్రోదయం కాలేదు...స్వరాజ్యంవచ్చి కుర్చీ ప్రక్కన నేలమీద కూర్చుంది..."తాతయ్యా..." జవాబులేదు..."తాతయ్యా, నన్ను క్షమించు తాతయ్యా... నేను యీ చదువుమాత్రం మానేస్తాను...వివాహం ముఖ్యం కాదు... నేను డాక్టరు కావటంలేదని కోపమా తాతయ్యా...నన్ను నీదగ్గరే వుండనియ్యి...క్షమించవా తాతయ్యా..." కంఠం వణికింది...తాతయ్య ఒళ్ళో ముఖం దాచుకుని దుఃఖాన్నాపుకోలేక పోయిన మనవరాల్ని...తల నిమురుతూ...చంద్రోదయాన్ని తదేకంగా చూస్తున్నాడు. చంద్రబింబం ద్రవీభూతమైనట్లుంది... దృష్టిని మార్చివేశాయి కన్నీటి తెరలు...కళ్ళుమూసుకున్నారు...చంద్రుడిబదులు "తాతయ్యా, బొమ్మల పెళ్ళి చేస్తాను రావా" అంటున్న అయిదేళ్ళ చిట్టి యొక్క మూర్తి...అదే చిన్నికృష్ణుని ప్రతిరూపమన్న మహదనుభూతి హృదయంలో...

"మ్యావ్" అందిపిల్లి...కళ్ళు తెరిచాడు...మసక చీకట్లో తెల్లగా పెంపుడుపిల్లి, స్వరాజ్యం వీపును ఆప్యాయంగా ఒరసికొంటూ 'మ్యావ్' అని మారాము చేస్తున్నది...

అప్పుడన్నారు సూర్యనారాయణగారు: "చిట్టీ, దొంగతనం నేర్పిందమ్మా నీపిల్లి యీమధ్య..."

ఆమె కళ్ళుతుడుచుకొని, పిల్లిని ఒడిలోకి తీసుకొన్నది.

"దానికి ఆకలిగా వున్నట్లుంది, వెళ్ళి పాలూ అన్నం పెట్టు" అన్నారాయన.

విమలవచ్చి గదిలో లైటు వేసింది. పంతులుగారామెతో "విమలా! రేపు విశ్వనాథం సత్యాన్ని తీసుకొస్తాడట!...సత్యం అంటే మన చిట్టి కాబోయే భర్త."

స్వరాజ్యం పిల్లిని తీసుకొని పారిపోయింది.